సాక్షి శ్రీకాకుళం

గురువారం ॥ 1 ॥ జూన్ ॥ 2023



సప్లిమెంటరీ స్పాట్..

ఇంటర్ సప్లిమెంటరీ స్పాట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి మొదలుకానుంది.

- 8లో



నేటి నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం నుంచి జరగనుందని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. జిల్లాలో 3,13,372 మందికి రూ.84.84కోట్లు విడుదల చేశామన్నారు.

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	37°	25°
ఇచ్ఛాపురం	37°	25°
పాతపట్నం	38°	27°
శ్రీకాకుళం	38°	24°

న్యూస్‌రీల్

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో సూర్యనారాయణస్వామి వారి కల్యాణోత్సవం బుధవారం ఉదయం స్థానిక అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ (మతత్రయ ఏకాదశి) ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ ప్రక్రియను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెండి సింహవాహనంలో వేంచింపజేసిన కల్యాణమూర్తుల కల్యాణ సేవలో పలువురు భక్తులు రూ.500 చెల్లించి పాల్గొన్నారు. వీరికి స్వామి వారి శేషవస్త్రాలతో పాటు కల్యాణ తలంబ్రాలను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఇప్పిలి ఫణీంద్ర శర్మ, బి.నగేష్‌శర్మ, వేదపండితులు పార్థ సారథి, వికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీగా తిప్పేస్వామి బాధ్యతల స్వీకరణ



తన చాంబరులో బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ ఎస్పీ జె.తిప్పేస్వామి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖ పరిపాలన అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా జె.తిప్పేస్వామి బుధవారం ఉదయం కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలువురు పోలీసు అధికారులు అడిషనల్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన 1989 సబ్ ఇన్‌స్పెక్టర్స్ బ్యాచ్‌కు చెందినవారు. చిత్తూరు జిల్లాలో ట్రాఫిక్ విభాగం డీఎస్పీగా విధులు నిర్వహించి పదోన్నతిపై జిల్లాకు వచ్చారు.

'దరఖాస్తు రీ ఓపెన్ కాకూడదు'



మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నిర్వహిస్తున్న స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. ఆయన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందనలో పునఃప్రారంభమైన, సంతృప్తికరంగా లేని అర్జీలపై సిబ్బందితో కలిసి సమీక్షించారు. అర్జీదారులకు అధికారులు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందనందునే అర్జీలు రీ ఓపెన్ అవుతున్నాయని, అలా కాకూడదని తెలిపారు. స్పందన ద్వారా అర్జీదారులు లాభపడాలని, ఈ విషయంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవకులుగానే భావించాలని, కావున ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని సూచించారు. అర్జీలపై తీసుకున్న చర్యలపై ఫొటోలు ఉండాలని, అలాగే అర్జీదారుడు సంతృప్తి చెందినట్లు స్పందన తీసుకోవాలని వివరించారు.

ఇంటిపై కూలిన విద్యుత్ స్తంభం



ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం

పొందూరు: పెనుబర్తి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సూరమ్మ అనే మహిళ ఇంటిపై విద్యుత్ స్తంభం పడింది. మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం విరిగి ఇంటిపై పడడంతో ఇంటి ముందర రేకులు షెడ్ విరిగిపోయింది. ఇంటిలో ఎవరూ లేకపోవడం ఎలాంటి ప్రమాదం జరగలేదు.

పొగాకుతో ప్రాణానికి ముప్పు

శ్రీకాకుళం రూరల్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ 60 రోజుల పాటు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా కార్యాచరణ ప్రకటించారు.

కళా విహీనం

మహానాడే సాక్ష్యం

- కళా వెంకటరావుకు చేదు అనుభవం
- మహానాడు వేదికగా కళాకు చంద్రబాబు చెక్
- ఇటీవల సస్పెన్షన్‌కు గురైన కలిశెట్టిని సత్కరించిన చంద్రబాబు
- జీర్ణించుకోలేకపోతున్న కళా అనుచరులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, టీడీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావుకు పెద్ద ఝలక్కే తగిలింది. స్థానిక నియోజకవర్గంలోనే కాదు అధిష్టానం వద్ద కూడా ఆయనకు విలువ లేదని తేలిపోయింది. కళా తన మాట నెగ్గించుకోవడానికి చేసిన యత్నాలు ఫలించలేదా? కళా వెంకటరావు మాటలను అధిష్టానం పెడచెవిన పెట్టిందా? ఆయన వైఖరిని తేలికగా తీసుకుందా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. నియోజకవర్గంలో తనకు ప్రత్యర్థిగా ఎదుగుతున్న కలిశెట్టి అప్పలనాయుడును తొక్కి పెట్టాలని, పార్టీలో ఆయనకు ఎలాంటి స్థానం లేదని, నియోజకవర్గంలో అంతా తానేనని కిమిడి కళా వెంకటరావు చూపించిన దూకుడుకు అధిష్టానమే చెక్ పెట్టింది.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో తన ప్రాబల్యానికి అడ్డు తగులుతున్నారని, చాపకింద నీరులా తనకు పోటీగా తయారవుతున్నారని, అడుగడుగునా తన హవాను తగ్గించడమే కాకుండా టీడీపీ కేడర్‌ను తనవైపు లాక్కుంటారన్న ఉద్దేశంతో కలిశెట్టి అప్పలనాయుడుపై కిమిడి కళా వెంకటరావు ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు కలిశెట్టిని ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారు. చివరికి కలిశెట్టి అప్పలనాయుడ్ని పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తూ జిల్లా నాయకత్వం నుంచి ప్రకటన కూడా జారీ చేయించారు. అయితే కలిశెట్టి మాత్రం వెనక్కి తగ్గలేదు. తనను సస్పెండ్ చేసినప్పటికీ ఆ ప్రకటన



రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో కలిశెట్టి అప్పలనాయుడిని సత్కరిస్తున్న చంద్రబాబు

చెల్లదంటూ పార్టీ కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. నియోజకవర్గ టీడీపీలో కళాకు దీటుగా ముందుకెళ్తున్నారు. చెప్పాలంటే కళా కంటే తన వెంటే కేడర్ ఉండేలా కలిశెట్టి రాజకీయాలు చేస్తున్నారు. అయితే కళా వెంకటరావు తన రాజకీయ చాతుర్యంతో కలిశెట్టి అప్పలనాయుడుకు పార్టీ కార్యక్రమాల్లో గౌరవం లేకుండా చేస్తున్నారు. పార్టీ నిర్వహించే సభలు, సమావేశాల్లో కలిశెట్టిని దూరంగా ఉంచుతున్నారు. ఇటీవల విజయనగరంలో జరిగిన పార్టీ మినీ మహానాడులో కలిశెట్టిని వేదికపైకి రానివ్వలేదు సరికదా నోటికొచ్చినట్టు మండిపడ్డారు. పార్టీ నుంచి సస్పెండైన వ్యక్తిని ఎలా వేదికపైకి పిలుస్తారని.. ఆహ్వానం పలికిన కనకల మురళీమోహన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దీంతో పార్టీలో కళా చెప్పినదే వేదమన్నట్టుగా మినీ మహానాడు సాగింది.

ఎందు'కళా'..

జిల్లా స్థాయిలో తన హవా చూపించిన కళా వెంకటరావు...రాజమహేంద్రవరంలో రాష్ట్ర పార్టీ నిర్వహించిన మహానాడులో చూపించలేకపోయారు. తనకు ప్రత్యర్థి, పార్టీ నాయకత్వంతో సస్పెన్షన్‌కు గురైన కలిశెట్టి అప్పలనాయుడును మాత్రం అధినేత చంద్రబాబు నాయుడు దగ్గరకు తీసుకున్నారు. ఒకచోట కూర్చొని కలిశెట్టితో మాట్లాడారు. హోటల్‌లో ఏర్పాటు చేసిన విందులో కలిశెట్టిని చంద్రబాబు ఏకంగా సత్కరించారు. దీంతో ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ శ్రేణులు సందేహంలో పడ్డాయి. సస్పెండ్ చేసిన వ్యక్తిని మినీ మహానాడుకు పిలవడమేంటని కళా అడ్డుకుంటే.. అదే వ్యక్తిని ఏకంగా అధినేత చంద్రబాబు సత్కరించడం చూస్తే టీడీపీలో సస్పెన్షన్ ప్రకటనకు విలువ లేదా? లేదంటే కళా వెంకటరావు ప్రాబల్యాన్ని తగ్గించాలని చేసే ఎత్తుగడా? అన్న చర్చ మొదలైంది. అక్కడ జరిగిన పరిణామాలు చూస్తుంటే కళా రాజకీయ వ్యూహాలు, అనుసరిస్తున్న వైఖరి, జారీ చేస్తున్న హుకుంను చంద్రబాబు పట్టించుకోకుండా కలిశెట్టిని సత్కరించారనే అభిప్రాయాన్ని టీడీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామంతో టీడీపీలోనే గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అధిష్టానం వ్యూహమేంటో తెలియడం లేదని, తాము ఎవరివైపు ఉండాలో తెలియని సందిగ్ధం నెలకొందని, చివరికీ పార్టీ ఎవరికీ పెద్ద పీట వేస్తుందో అంతు చిక్కడం లేదని, అంతవరకు తాము ఎవరి వెంట తిరగాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఎచ్చెర్ల టీడీపీ శ్రేణులు అంతర్మధనంలో పడ్డాయి.

కలలు చెదిరెను.. కన్నీరే మిగిలెను

ఆ నవ వధువు కలలన్నీ ఛిద్రమైపోయాయి. ఆ కుటుంబంలోని ఆనందమంతా ఆవిరైపోయింది. చదువు, ఉద్యోగం, వివాహం అంటూ ఒక్కో మెట్టూ ఎక్కుతూ వచ్చిన ఆ యువకుడి జీవితం అక్కడితోనే ముగిసిపోయింది. కొల్లవానిపేట రైల్వేగేటు వద్ద కాపు కాచిన మృత్యుదేవత నవ వరుడిని తనతో తీసుకెళ్లిపోయింది. రెండు నెలల కిందటే వివాహం చేసుకున్న ఆ యువకుడి మృతితో కుటుంబం తల్లడిల్లిపోయింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఫొటోలు తీస్తున్న రైల్వే పోలీసులు (ఇన్‌సెట్) మృతుడు సోమేశ్వరరావు (ఫైల్)

- రైలు ఢీకొని ఇంజినీరింగ్ సహాయకుడు మృతి
- కొల్లవానిపేట రైల్వే గేటు వద్ద ప్రమాదం
- మృతునికి రెండు నెలల కిందటే వివాహం

నరసన్నపేట: చక్కగా చదువుకున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. మరో ఉద్యోగినితో వివాహం జరిగింది. ఇక జీవితమంతా హాయిగా కలిసి బతకవచ్చని ఆశ పడిన ఆ వధూవరులపై విధి పగబట్టింది. మృత్యువు దారి కాచి మరీ వరుడిని మింగేసింది. నరసన్నపేట మండలం కామేశ్వరిపేటలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మట్ట సోమేశ్వరరావు (28) కొల్లవానిపేట రైల్వే గేటు వద్ద బుధవారం ఉదయం 10.20 గంటల సమయంలో యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఐదు నిమిషాల్లో కామేశ్వరిపేట చేరుకుంటాడనగా ఈ ప్రమాదం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళంలోని బలగకు చెందిన మట్ట శ్యామలరావు కుమారుడు సోమేశ్వరరావు చక్కగా చదువుకున్నాడు. సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకుడిగా ఉద్యోగం వచ్చింది. మంచి సంబంధం రావడంతో రెండు నెలల కిందటే వివాహం చేశారు. ఆమె కూడా రణస్థలం మండలంలోని సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ లాగానే సోమేశ్వరరావు బుధవారం తన బండిపై కామేశ్వరిపేటలోని సచివాలయానికి బయల్దేరాడు. దారిలో కొల్లవానిపేట వద్ద గేటు వేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు సోమేశ్వరరావు ప్రాణాలు తీశాయి.

గేటు లేవడంతోనే..

సరిగ్గా ఉదయం 10.16కు కొల్లవానిపేట గేటు వేసి ఉంది. రెండు వైపులా వాహనాలు నిలిచి ఉన్నాయి. ఆమదాలవలస నుంచి తిలారు వైపునకు గూడ్స్ ట్రైన్ వెళ్లింది. ఆ రైలు వెళ్లగానే గేటు లేచింది. దీంతో



కన్నీరుమున్నీరవుతున్న మృతుని తల్లిదండ్రులు, సోదరి

కొల్లవానిపేట నుంచి ఒక కారు, ఆటో గేటు లోపలికి వచ్చాయి. సోమేశ్వరరావు కూడా తన బండితో ముందుకు కదిలాడు. అంతే.. అదే ట్రాక్‌పై ఊహించని వేగంతో వచ్చిన యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ సోమేశ్వరరావును అమాంతం ఢీకొట్టింది. ఆ ధాటికి అతడి శరీరం తునాతునకలైంది. రైలు పట్టాలన్నీ రక్తంతో తడిచిపోయాయి. క్యారేజీ, హెల్మెట్ ఇలా ఆయన వస్తువులన్నీ చాలాదూరం ఎగిరిపడ్డాయి. అయితే తమ కళ్ల ముందే ప్రమాదం జరగడంతో గేటు వద్ద ఉన్న వాహనదారులు నిశ్చేష్టులైపోయారు. రెప్పపాటులో తాము ప్రమాదం నుంచి బయటపడ్డామని ప్రత్యక్ష సాక్షులు వేశాల రమేష్, ఆర్.రామకృష్ణ, పుల్లట వెంకటరమణ తెలిపారు. ఆటోలో పది మంది, కారులో నలుగురు ఉన్నారని, వెంట్రుకవాసిలో వీరు ప్రమాదం నుంచి బయటపడ్డారని చెప్పారు.

కన్నీరుమున్నీరు..

అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు ఇలా దుర్మరణం పాలవ్వడంతో మృతుని తల్లిదండ్రులు శ్యామలరావు, సరస్వతిలు కన్నీరుమున్నీరయ్యారు. అతని సోదరి గౌతమి కూడా తల్లడిల్లిపోయింది. సోమేశ్వరరావు భార్య జయశ్రీ వేదన చూసి అంతా



భార్య జయశ్రీని ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు

కన్నీరుపెట్టుకున్నారు. నన్ను వదిలి వెళ్లిపోయావా అంటూ ఆమె గుండెలవిసేలా రోదిస్తుంటే ఆపడం ఎవరి తరం కాలేదు.

కేసు నమోదు..

ఈ ప్రమాదంలో సెక్షన్ 174 కింద కేసు నమోదు చేశామని ఆమదాలవలస రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆమదాలవలస స్టేషన్ మాస్టర్ రాజశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి ఏఎస్ఐ చిట్టిబాబు, హెచ్‌సీ మధుసూదనరావు వచ్చారు. రైల్వేగేట్‌మెన్ మధుపర్ మిశ్రో నుంచి వివరణ తీసుకున్నామని, ప్రమాదవశాత్తు జరిగినట్లు కేసు నమోదు చేశామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోమేశ్వరరావు మృతిపై నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, ఎంపీడీఓ మధుసూదనరావు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మోహనరావు, ఉదయ భాస్కర్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల విభాగం అధ్యక్షుడు ముకుందరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షులు దివ్య, కామేశ్వరిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వాకముళ్ల చక్రధర్, జోగినాయుడులు సంతాపం వ్యక్తం చేశారు.

కర్షకా.. నీకే కానుక



- నేడు రైతుల ఖాతాల్లో ఐదో ఏట తొలి విడత పెట్టుబడి సాయం జమ
- జిల్లాలో 3.16 లక్షలమందికి గాను రూ.236.65 కోట్లు లబ్ధి
- అకాల వర్షాలకు నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6.54లక్షలు అందజేత

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఖరీఫ్ ప్రారంభానికి ముందు కర్షకుడికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. వరుసగా ఐదో ఏట తొలి విడత పెట్టుబడి సాయాన్ని గురువారం రైతుల ఖాతాలో జమ చేయనుంది. జిల్లాలో 3.16 లక్షల మందికి గాను రూ.236.65 కోట్లు మేర లబ్ధి చేకూరనుంది. అన్నదాతను ప్రభుత్వం అన్ని వేళలా ఆదుకుంటోంది. ఆర్బీకేల ద్వారా విత్తనాలు అందించడం నుంచి కొనుగోళ్ల వరకు సాయం చేస్తోంది. డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ప్రకారం ప్రతి రైతుకు సాయం అందిస్తోంది. సొంత భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు (సీసీఆర్‌సీ పత్రాలు కలిగిన) రైతులకు, (ఆర్‌ఓఎఫ్‌ఆర్) పట్టాలు కలిగిన రైతులకు పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.13500 ఆర్థిక సాయం చేస్తోంది. మొదట విడతగా ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7,500, రెండో విడతగా అక్టోబరులో ఖరీఫ్ పంట కోతకై నా/రబీ పంటల అవసరాలకై నా రూ.4000, మూడో విడతగా ధాన్యం నూర్పు ల ఖర్చుల నిమిత్తం రూ.2,000 అందిస్తున్నారు. వాస్తవానికి రైతు భరోసా కింద నాలుగేళ్లే సాయం చేస్తామని ప్రభుత్వం ముందు ప్రకటించింది. కానీ సీఎం వైఎస్ జగన్ మాత్రం రైతులకు ఆర్థిక సాయం అందించాలనే నిశ్చయంతో ఐదో ఏడాది కూడా రైతు భరోసా అందిస్తున్నారు. దీనిలో భాగంగానే గురువారం శ్రీకాకుళంలోని బాపూజీ కళా మందిరంలో జిల్లా కార్యక్రమం నిర్వహించనున్నారు.

సంవత్సరం	లబ్ధి పొందిన కుటుంబాలు	లబ్ధి (రూ.కోట్లలో)
2019–20	3,34,057	రూ 450.98
2020–21	3,80,901	రూ 509.04
2021–22	3,78,685	రూ 525.62
2022–23	3,10,346	రూ 393.15
2023–24 (మొదటివిడత)	3,15,554	రూ 236.658

భరోసా కల్పించారు..



నాకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ కింద 0.75 సెంట్ల భూమి ఉంది. వరి, జీడిమామిడి పండిస్తున్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఏటా పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించేవాడిని. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఖరీఫ్ ప్రారంభం నాటికి నా ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించి రైతు బతుక్కి భరోసా కల్పిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితకాలం రుణపడి ఉంటాం.

– గొర్లె శ్రీనివాసరావు, కొత్తూరు మండలం,దిమిలి గ్రామం.

మహిళా రైతులకు ఊతం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహం మహిళా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. నాకున్న ఎకరా పొలంలో వరితో పాటు అపరాలు, వేరుశనగ వేశాను. అయితే వ్యవసాయం పూర్తిగా వదిలేద్దామన్న సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుభరోసా పేరిట ఆదు కుంది. వ్యవసాయం చేయాలన్న ఉత్సాహాన్ని నింపింది. తరతరాల పాటు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలని రైతులమంతా కోరుతున్నాం.

– పైడి వెంకటేశ్వరి, మహిళారైతు, ఎచ్చెర్ల మండలం, కేశవరావుపేట.

ఐదో ఏటా ఇవ్వడం శుభ పరిణామం



నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ రైతుభరోసా పథకాన్ని నాలుగేళ్లు ఇస్తామన్న హామీని ఐదో ఏటా కొనసాగించడం శుభ పరిణామం. రైతులకు ఉపయోగపడే స్కీమ్‌లను అమలు చేయడంతో సీఎం వైఎస్ జగన్‌ను మించిన వారు లేరు. ఖరీఫ్‌కు ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించడం బాగుంది.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి

పకడ్బందీగా జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

కంచిలి: జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ ప్రక్రియను విద్యాశాఖ యంత్రాంగం పకడ్బందీగా చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య వెల్లడించారు. ఆయన జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన కోసం కంచిలి, కవిటి, సోంపేట మండలాల్లో బుధవారం పర్యటించారు. కంచిలి మండల కేంద్రంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. 12వ తేదీన ప్రతి పిల్లాడికి జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా కిట్లలో గల వస్తువుల్లో మరో 20 శాతం వరకు ఇంకా మండలాలకు చేరాల్సి ఉందన్నారు. ఇక 14.50 లక్షలు పాఠ్యపుస్తకాలు వచ్చాయని, మరో 4.90లక్షల పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. యూనిఫారాలు కూడా 3 సైజుల్లో సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు కంచిలి ఎంఈఓ ఎస్.శివరాంప్రసాద్ రూపొందించిన ఫార్మేట్ ఆదర్శవంతంగా ఉందని, దీన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామని డీఈఓ వెల్లడించారు. అలాగే జిల్లాలో 296 మంది నైట్ వాచ్‌మెన్లను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 6 హైస్కూల్స్‌లో ఇంటర్మీడియెట్ తరగతులను గత విద్యాసంవత్సరం నుంచే ప్రారంభించగా, ఈ ఏడాది అక్కడ పని చేసేందుకు 42 మంది ఎస్జీటీలను అధ్యాపకులుగా బోధించేందుకు నియమించామన్నారు. అలాగే అన్ని ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్లనే నియమించామన్నారు. మూసేసిన ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసిన 18 మంది టీచర్లను ప్రభుత్వ పాఠశాలల్లో నియమించామన్నారు.

పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 32 పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. ఐఎఫ్‌పీ పథకం కింద జిల్లాలో 195 హైస్కూల్స్, 93 యూపీ స్కూళ్లను ఎంపిక చేశామని, ఇందులో 333 స్మార్ట్ టీవీలు, 289 ఐఎఫ్‌పీలు ఆయా పాఠశాలల్లో బోధించేందుకు చేరినట్లు తెలిపారు.



కంచిలి హైస్కూల్ స్టాక్ పాయింట్‌లో పరిశీలిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

ఎంఎల్‌ఎస్ పాయింట్ అక్రమాలపై విచారణ

కొత్తూరు: కొత్తూరు మండల స్థాయి స్టాక్ పాయింట్ (గోదాం) లో గత ఏడాది జరిగిన అక్రమాలపై సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం విచారణ చేశారు. ఈ అక్రమాలపై అప్పట్లో పోలీసు కేసు నమోదైంది. సుమారు 198 మెట్రిక్ టన్నుల బియ్యం, పంచదారతో పాటు పలు నిత్యావసరాలకు సంబంధించిన రికార్డులను సబ్ కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అప్పట్లో గోదాం తనిఖీ చేసి వారిని పిలిపించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సరుకులను పరిశీలించారు. దీనికి సంబంధించి సీజ్ చేసిన కొన్ని పుస్తకాలను ఎస్ఐ మురపాక గోవింద్ సబ్ కలెక్టర్‌కు అందించారు. ఇంకా పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సి ఉందని సబ్ కలెక్టర్ తెలిపారు. అనంతరం కుంటిభద్ర కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వివాదంలో ఉన్న స్థలాన్ని జెడ్పీటీసీ కామక భాగ్యతి వినతి మేరకు సబ్ కలెక్టర్ పరిశీలించారు.







● గేటు వేసినా ఆగరే..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే గేటు వద్ద కొందరు ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారు. జంట పట్టణాలకు చెందిన అత్యధిక ప్రయాణికులు ఈ రైలు పట్టాలపై రాకపోకలు జరుపుతుండటంతో ప్రమాదకరంగా మారింది.

–కాశీబుగ్గ



కాశీబుగ్గ: గేటు వేసినా దాటుతున్న వాహనదారులు

క్లుప్తంగా

నేటి నుంచి మలేరియా నిర్మూలన మాసోత్సవాలు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో భాగంగా జిల్లా మలేరియా నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 30 వరకు మలేరియా నిర్మూలన వారోత్సవాలు జరగనున్నాయని డీఎంహెచ్ఓ బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8.30 గంటలకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. అన్ని విభాగాధిపతులు, ఆశావర్కర్లు, సిబ్బంది విధిగా హాజరుకావాలని కోరారు.

2న జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 2న శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి పీబీ శ్రీనివాస్ చెప్పారు. ఎచ్చెర్ల ఐటీఐ స్కిల్ హబ్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. 19 నుంచి 30 ఏళ్ల వయస్సువారు అర్హులని తెలిపారు. 16 బహుళజాతి కంపెనీలు హాజరుకానున్నాయని పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి పీజీ విద్యార్హత గల వారు అర్హులని చెప్పారు. అర్హత ఆధారంగా ఉద్యోగాల ఎంపిక ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజన్ ధ్రువీకరణ పత్రాలుతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్ గానీ, 6301275511, 8317652552, 6301045132 నంబర్లను గానీ సంప్రదించాలని సూచించారు.

ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 3న నిర్వహించాల్సిన ప్లేస్‌మెంట్ అధికారి, టీసీడీఈ కోఆర్డినేటర్ పోస్టుల వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు గమనించాలని కోరారు.

నేడు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం' అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం శ్రీకాకుళం ఈఈ ఎస్.శంకర్ నాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)లో భాగంగా ఈ నెల 1వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు సీఎన్‌కాలనీలోగల న్యూ సెంట్రల్ స్కూల్ 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం ' అనే అంశం మీద 8, 9, 10 తరగతుల విద్యార్థినీవిద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలో గల వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థిని విద్యార్థులు పాల్గొనాలని కోరారు. విజేతలకు జూన్ 5వ తేదీన బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సమాచార శాఖ డీడీ



డిప్యూటీ డైరెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర సమాచార శాఖ (ఐఅండ్‌పీఆర్) డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.రామచంద్రమూర్తి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, డీపీఆర్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	55,450–00
బంగారం(22సి. 10గ్రా.)	60,490–00
వెండి (కిలో)	72,600–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 505.00
విజయనగరం	రూ. 509.00
శ్రీకాకుళం	రూ.509.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284

సప్లిమెంటరీ స్పాట్‌కు సన్నద్ధం



స్పాట్ కేంద్రంలో ఆర్ఐఓ, జనరల్ 1, 2 తదితరులు

- ముగిసిన ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- నేటి నుంచి మూల్యాంకనం ప్రారంభం
- మూడు విడతలుగా ప్రక్రియ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిశాయి. దీంతో జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్)కు సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. శ్రీకాకుళం ప్రభుత్వ (బాలుర) జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభంకానున్న ఈ మూల్యాంకనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కేంద్రంలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. ఎండలు, ఉక్కపోతల నేపథ్యంలో తాగునీరు, ఫ్యాన్లు అమర్చారు. ఎగ్జామినర్లు జవాబుపత్రాలను దిద్దేందుకు అనువుగా స్థానికంగా పలు కళాశాలల నుంచి ఫర్నిచర్‌ను తెప్పించారు.

మూడు స్పెల్స్.. 80 వేల పత్రాలు..

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి జిల్లాకు 80వేల జవాబుపత్రాలు చేరుకున్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 13 ప్రధాన సబ్జెక్టుల జవాబుపత్రాలు ఉన్నాయి. కోడింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. మూల్యాంకనం మొత్తం మూడు విడత (స్పెల్స్)ల్లో జరగనుంది. మే 28 నుంచి సంస్కృతం పేపర్ల దిద్దుబాటు మొదలైంది. పూర్తిస్థాయిలో నేటి నుంచి మొదలుకానుంది. ఒక్కో ఎగ్జామినర్ పూటకు 15 చొప్పున రోజుకు 30 పేపర్లు దిద్దాల్సి ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ ప్రక్రియ కొనసాగనుంది.

నియామక ప్రక్రియ పూర్తి..

ఎగ్జామినర్ల నియామక ఆర్డర్లను ఇంటర్మీడియెట్ బోర్డు ఇప్పటికే కళాశాలలకు చేరవేసింది. స్పాట్ క్యాంప్ ఆఫీసర్‌గా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు వ్యవహరిస్తున్నారు. జనరల్-1 బి.శ్యామ్‌సుందరరావు (ప్రిన్సిపాల్- ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల), జనరల్-2గా కీర్తి తవిటినాయుడు (ప్రిన్సిపాల్, కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాల) సీసీవో-1 మెట్ట కృష్ణవేణి (ప్రిన్సిపాల్- శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల), సీసీవో-2 పి.రామ్‌మనోహర్ (ప్రిన్సిపాల్- పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల) నియమితులయ్యారు. సిబ్బంది నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విధిగా హాజరుకావాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం..



జవాబు పత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తిచేశాం. స్పెల్స్‌ను బట్టి సిబ్బంది విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. సమయపాలన పాటించాలి. దిద్దుబాటులో అప్రమత్తంగా లేకుంటే తప్పులకు తగిన మూల్యం చెల్లించకతప్పదు.

– ఎస్.తవిటినాయుడు, ఆర్ఐఓ/స్పాట్ క్యాంప్ ఆఫీసర్, శ్రీకాకుళం

మూడు స్పెల్స్ షెడ్యూల్ ఇదీ..

స్పెల్	మొదలయ్యే తేదీ	సబ్జెక్టులు
1వ స్పెల్	మే 28 నుంచి	సంస్కృతం
2వ స్పెల్	ఈ నెల 1 నుంచి	తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, బోటనీ, సివిక్స్
3వ స్పెల్	ఈనెల 3 నుంచి	కెమిస్ట్రీ, కామర్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్, జువాలజీ, హిస్టరీ

అరసవల్లిలో సామూహిక ఉపనయనాలు



వటువును ఆశీర్వదిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో అరసవల్లిలోని సత్యసాయి కల్యాణ మండపంలో బుధవారం సామూహిక ఉపనయనాలు ఘనంగా జరిగాయి. భాస్కరభట్ల శ్రీరామశర్మ ఆధ్వర్యంలో 14 మంది వటువులకు సంప్రదాయబద్ధంగా ఉపనయనాలు చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు వటువులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుమ్మా నగేష్ మంత్రి ధర్మానను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కె.ఎ.ఎన్.భుక్త, అరసవల్లి ఆలయ అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, కోనసీమ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అంబేడ్కర్, సుసరాపు శ్రీధర్, పెంట చంద్రశేఖరశర్మ, రిటైర్డ్ ఆర్డీవో ఎం.శ్రీరామమూర్తి, రిటైర్డ్ తహసీల్దార్ రవీంద్రనాథ్, వి.వి.ఎస్.ప్రకాష్, గుమ్మా రఘురామ్, వై.గాయత్రి, టి.కామేశ్వరి, ఎం.గోపాలరావు, కొండబాబు, రమణమూర్తి, వి.రాజేష్, ఎస్.ఆంజనేయులు, ఆకెళ్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం రైతుబిడ్డకు గోల్డ్‌మెడల్



వీసీ నుంచి గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అనిత

కవిటి: మండలంలోని చండిపుట్టుగ గ్రామానికి చెందిన రైతు ఎన్ని శ్రీనివాసరావు, నిర్మల దంపతుల కుమార్తె ఎన్ని అనిత అగ్రికల్చరల్ ఇంజినీరింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. బుధవారం కాకినాడ జేఎన్‌టీయూ 9వ స్నాతకోత్సవంలో వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు చేతుల మీదుగా పతకం అందుకుంది. ఈమె కాకినాడ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్(కైట్) కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. అనిత సోంపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసింది. విశాఖపట్నం పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ కాలేజీలో డిప్లమా పూర్తిచేసింది. రైతు కుటుంబంలో పుట్టి ఉన్నత విద్యలో బంగారు పతకం సాధించడం పట్ల అనితను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మ, పీఏసీఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, సర్పంచ్ సనపల జానకిరావు, ఎంపీటీసీ జగదీశ్వరి, రిటైర్డ్ బోటనీ లెక్చరర్ బొర్ర రామకృష్ణ అభినందించారు.

నదిలో పడి వృద్ధుడి మృత్యువాత

మందస : మండలంలోని సిరిపురం పంచాయతీ లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన జినగ వెంకటరావు (70) మహేంద్ర తనయ నది బ్రిడ్జి నుంచి పడి బుధవారం మరణించాడు. ప్రమాదవశాత్తూ కిందకు పడిపోయాడా.. ఆత్మహత్య చేసుకున్నాడా తెలియడంలేదు. గుర్తు తెలియని వ్యక్తి పడిపోయాడని తెలియడంతో స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరి రక్షించడానికి ప్రయత్నించారు. అప్పటికే వెంకటరావు మరణించినట్టు గుర్తించారు. మృతుని కుమారుడు జగదీశ్వరరావు ఫిర్యాదు మేరకు మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



నేహంత్‌ను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

పాతపట్నం: పాతపట్నంలోని శివశంకర్ కాలనీకి చెందిన కోళ్ల మహేష్, భారతీ దంపతుల నాలుగేళ్ల కుమారుడు నేహంత్ బుధవారం ఉదయం తప్పిపోయాడు. నీలమణిదుర్గ పెద్దపండగ హడావిడిలో ఉండగా బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ కామేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు గాలించగా కానిస్టేబుల్ భాస్కరరావుకు ప్రధాన రహదారిపై అబ్బాయి కనిపించడంతో తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆలయంలో చోరీ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ మహేశ్వరమ్మ ఆలయంలో దొంగలు పడ్డారు. ప్రధాన హుండీ నుంచి పగలగొట్టి సుమారు రూ.30 వేల నగదును దోచుకుపోయారు. బుధవారం ఉదయం ఆలయం వద్దకు చేరుకునేసరికి తలుపులు తెరిచి ఉండటంతో నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూగబంధం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జె.శ్రీనివాస్ రచించిన 'మూగబంధం' కథల సంపుటిని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతినిధి, రచయిత అట్టాడ అప్పలనాయుడు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి భావాలతో కథలను రచించారని అన్నారు. పుస్తకాన్ని భమిడిపాటి గౌరీశంకరశర్మ సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామీణ బ్యాంకులో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రచయిత, మాజీ బ్యాంకు ఉద్యోగి వైవీ రమణ, బ్యాంకు అధికారి చిరంజీవి, లాయర్ సత్యవాణి, డాక్టర్ బాడాన దేవభూషణరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి



ఇరోతు హేమంత్ (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పెదవంక గ్రామానికి చెందిన ఇరోతు హేమంత్(25) అనుమానాస్పదంగా మృతి చెందాడు. నాలుగు రోజుల కిందట అదృశ్యమైన ఈ యువకుడు బుధవారం గ్రామ పరిసర జీడి తోటల్లో శవమై కనిపించడంతో ఉద్దానంలో సంచలనం రేకెత్తించింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హేమంత్ శనివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో అక్కుపల్లి వద్ద దాబాలో స్నేహితునితో కలిసి భోజనం చేశాడు. రూ.500 నోటు విషయంలో దాబా నిర్వాహకులు, హేమంత్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో తోటి స్నేహితునికి గాయాలైనట్లు తెలిసింది. ఆదివారం ఉదయం 10 గంటల వరకు కుటుంబ సభ్యులతోనే హేమంత్ కలిసి ఉన్నాడు. ఇతని సోదరుడు ఇరోతు కృష్ణారావు ఫ్యాన్ బాగు చేసేందుకు కాశీబుగ్గ వెళ్లాడు. అక్కడ డబ్బుల కోసం హేమంత్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని రావడంతో గ్రామానికి వచ్చి వెతకగా హేమంత్ ఆచూకీ కనిపించలేదు. అప్పటి నుంచి గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో బుధవారం సమీప జీడి తోటల్లో జీడి చెట్టుకు హేమంత్ మృతదేహం వేలాడటాన్ని మహిళా రైతు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించింది. సోదరుడు కృష్ణారావు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇరోతు వీరాస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.మధుసూదనరావు తెలిపారు. కాగా, హేమంత్ మృతి పట్ల కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు.

పారదర్శకంగా పోలీసు బదిలీలు

శ్రీకాకుళం క్రైమ్ : సాధారణ బదిలీల్లో భాగంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు సిబ్బందికి పారదర్శకంగా ట్రాన్స్‌ఫర్లు చేపట్టారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో వివిధ విభాగాల్లో ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న పోలీసు కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి సిబ్బందికి కౌన్సిలింగ్ నిర్వహించి స్టేషన్ల వారీగా ఖాళీలను అనుసరించి బదిలీ చేశారు. కోరిన చోట పోస్టింగ్ ఇచ్చి పారదర్శకంగా నిర్వహించిన బదిలీలపై సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్పీ ఆధ్వర్యంలో బదిలీల్లో కమిటీ సభ్యులుగా అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ఉన్నారు. ఐదేళ్ల సర్వీసు పైబడిన 164 మందికి ఈ బదిలీలు జరిగాయి.

ఆర్టీసీ బస్సు ఎక్కుతూ ప్రయాణికురాలి మృతి



కరగాన సిమ్మమ్మ(ఫైల్)

పాతపట్నం: పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం సాయంత్రం శ్రీకాకుళం వెళ్లే బస్సు ఎక్కుతూ జారిపడటంతో ప్రయాణికురాలు మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జలుమూరు మండలం చల్లపేటకు చెందిన కరగాన సిమ్మమ్మ (35) పాతపట్నం పండుగలకు ఈ నెల 29న బయలుదేరి బంధువుల ఇంటికి వచ్చింది. పెద్ద పండగ ముగియడంతో బుధవారం మధ్యాహ్నం భోజనం తర్వాత తిరుగు ప్రయాణంలో పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంది. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో చల్లపేటకు వెళ్లేందుకు శ్రీకాకుళం బస్సు ఎక్కింది. బస్సుడ్రైవర్ స్పీడు పెంచడంతో సిమ్మమ్మ కాలు జారిపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. సిమ్మమ్మకు భర్త తవుడు, కుమార్తె ధనలక్ష్మి, కుమారుడు హరి ఉన్నారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు.

కొనసాగుతున్న పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్-2023 ప్రవేశ కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతోంది. వెరిఫికేషన్ ఈ నెల 29న ప్రారంభం కాగా, బుధవారం 28001 నుంచి 43000 ర్యాంకుల వరకు పరిశీలించారు. ఈ పరిశీలనకు 352 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఓసీ, బీసీలు 319, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 33 మంది ఉన్నారు. మూడు రోజుల్లో మొత్తం 1082 మంది హాజరయ్యారు. గురువారం 23001 నుంచి 58000 ర్యాంకు వరకు పరిశీలించనున్నారు. గురువారం నుంచి ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆప్షన్ల ఎంపిక 1, 2 తేదీల్లో 1 నుంచి 50వేల ర్యాంకు మధ్య, 3, 4 తేదీల్లో 50001 నుంచి 90000 మధ్య, 5, 6 తేదీల్లో 90001 నుంచి చివరి ర్యాంకు వరకు విద్యార్థులు చేసుకోవాల్సి ఉంటుంది. ఏడున ఆప్షన్ల మార్పు ఉంటుంది.

వైభవంగా ముఖలింగేశ్వరుని కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ ఉత్సవం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. కొట్నం దంపు కార్యక్రమం ముత్తయిదువులు నిర్వహించారు. ముందుగా స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను చక్కగా అలంకరించి నంది వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

త్వరగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) రాష్ట్ర చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను బుధవారం సందర్శించారు. మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాల పరిస్థితి, అకడమిక్, పరిపాలన వ్యవహారాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తరగతి గదులు, వసతి గృహాలను విద్యార్థులకు సరిపడా సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. రన్నింగ్ వాటర్ సౌకర్యం, తాగునీరు, డ్రైనేజ్ వ్యవస్థ వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగు వేల మంది విద్యార్థుల సామర్థ్యం స్థానికంగా ఉండగా, మరికొన్ని నెలల్లో భవనాలు పూర్తయితే ఐదు వేల మంది విద్యార్థులకు వసతి సిద్ధమవుతుందని చెప్పారు. 2024 నాటికి ఆరు వేల మంది విద్యార్థులకు వసతి, అకడమిక్ సౌకర్యాలు కల్పనపై దృష్టి పెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, ఇంజినీరింగ్ అధికారులు తేజ్‌కిరణ్, సురేష్, పీఆర్‌ఓ మామిడి షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం/శ్రీకాకుళం రూరల్: రానున్న వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా దోమల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జంపు కృష్ణమోహన్ అన్నారు. జిల్లా మలేరియా కన్సల్టెంట్ ఎల్.శ్రీకాంత్‌తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని, దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధి, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల నుంచి కొంతవరకు రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రీనివాసరావు, మీడియా లైజినింగ్ అధికారులు పైడి వెంకటరమణ, కింజరాపు రవిప్రసాద్, జి.రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశయన సంఘం అధ్యక్షుల ఎన్నిక



నూతన అధ్యక్షులతో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీశయన సంఘం కేంద్ర అధ్యక్షునిగా వంగా మహేష్, రాష్ట్ర అధ్యక్షునిగా లోడ అప్పారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళం నగరంలో ఎన్జీవో హోమ్‌లో బుధవారం జిల్లా శ్రీశయన సంఘ అధ్యక్షుడు మండల మన్మధరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రాష్ట్ర, కేంద్ర శ్రీశయన సంఘం ప్రతినిధులు హజరయ్యారు. కార్యక్రమంలో శ్రీశయన సంఘం పెద్దలు కిల్లి గోపాలం, రుప్ప రాంబాబు, బొంగు రాంబాబు, పట్నాల వెంకటేష్ బాబు, కోల శ్రీరాములు, కోల బలరాం, జిల్లా సంఘం పెద్దలు డి.పి.దేవ్, గుజ్జల శాంత మూర్తి, ఇర్రి ఆదినారాయణ, కర్రి రంగాజీదేవ్, బంటుపల్లి రాజశేఖర్, పోలాకి చిన్నారావు, బాణాల కృష్ణారావు, జాక శ్యామ్, ఇర్రి అచ్చెన్న, దేవాడ మోహనరావు, సిందిరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



1985-90 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మందస: మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం ఒకే వేదికపై కలిశారు. చదువులమ్మ ఒడిలో పాత జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు.ముందుగా ఒడియా యంగ్‌మెన్ లైబ్రరీ నుంచి హైస్కూలు వరకు ర్యాలీగా ఉపాధ్యాయులను వాహనాలపై ఊరేగిస్తూ వెళ్లారు. విద్యాలయం ఆవరణలోని సరస్వతి, గాంధీ, అంబేడ్కర్, శ్రీరాజా శ్రీనివాసమహరాజు విగ్రహాలకు పూలమాలలు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులకు పుష్పాభిషేకం చేస్తూ పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో గిన్ని రమేష్‌బాబు దుర్గాప్రసాద్ పాణిగ్రాహి, నీలకంఠం, మేనకేశ్వరరావు, గౌరీశంకర్ పట్నాయక్, మెట్ట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ONE SITTING: 10th, 12th, B.A, B.Com., B.Sc., M.A., M.Com, M.Sc, B.Ed, BBA, BCA, MBA, MCA, Nursing, Pharmacy, Dip in Vet, B.Tech., from Recog. University in India (for Discontinued) ✆ : 73383 76874 [R-05]

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజీలు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 9959617233, 6302565275 [M-1221308]

■ఆయాలు, సెక్యూరిటీ గార్డ్స్, వాచ్‌మెన్స్, పని మనుషులు కావలెను. మంచి జీతం, ఉచిత వసతి కల్పించబడును. నలంద CBSE స్కూల్, గాయత్రి నగర్, కావలి. సెల్: 99498 49758. [N-1189505]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7995984445 [HA-231]

■ Job Vacancy: Age:18 to 30, 10th to Any Degree, Office Job 18000 to 25000/- work from home 15000 to 18000/- ✆ 9346416039 [T-774110]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422. [H-796791]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786385]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.